క్లుప్తంగా

దివ్యాంగులకు బస్‌పాస్‌లు



దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందిస్తున్న సర్పంచ్ ప్రమీల

కుల్కచర్ల: గ్రామస్తులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని మందిపల్ సర్పంచ్ మఠం ప్రమీల అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల పరిధిలో మందిపల్ గ్రామంలో దివ్యాంగులకు సర్పంచ్ ఉచిత బస్‌పాస్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మఠం రాజశేఖర్, వడ్డె బాల్‌రాజ్ పాల్గొన్నారు.

అంధత్వనివారణకే 'కంటి వెలుగు'



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

కుల్కచర్ల: అంధత్వాన్ని నివారించేందుకే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని సర్పంచ్ సివి బాలునాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అల్లాపూర్ పంచాయతీలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటిఅద్దాలు పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మైమూనా, వైద్యురాలు శివాని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

ధారూరు: మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో పునఃనిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యురాలు కొస్నం సుజాత, సర్పంచ్ విశాల రూ.5లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం వారు ఆలయ నిర్వాహకులు మొదటి విడతగా రూ.2లక్షలు అందజేశారు.

రెండో ప్రియుడి మోజులో..

- మొదటి ప్రియుడి హత్య
- డ్రమ్ము మర్డర్ కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం ఏసీపీ అంజయ్య

పహాడీషరీఫ్: పది రోజుల క్రితం వ్యక్తిని దారుణంగా హతమార్చి డ్రమ్ములో కుక్కి చెరువులో పడేసిన ఘటనకు వివాహేతర సంబంధమే కారణమని పహాడీషరీఫ్ పోలీసులు నిర్ధారించారు. రెండో ప్రియుడి మోజులో పడిన మహిళ అతనితో కలిసి మొదటి ప్రియుడిని హత్య చేసింది. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం ఏసీపీ సి.అంజయ్య, ఇన్‌స్పెక్టర్ ఎం.కాశీ విశ్వనాథ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పూరన్‌సింగ్ అలియాస్ దీపక్(30)కి వివాహానికి ముందే బంధువైన జయాదేవితో ప్రేమాయణం కొనసాగింది. అనివార్య కారణాలతో ఇద్దరూ వేర్వేరు సంబంధాలు చేసుకోవాల్సి వచ్చింది. వివాహానంతరం భార్య మమతతో కలిసి పూరన్‌సింగ్ చాంద్రాయణగుట్ట బండ్లగూడకు వలస వచ్చాడు. లాక్‌డౌన్ సమయంలో జయాదేవి తన భర్త, పిల్లలను వదిలేసి కాటేదాన్‌కు వచ్చింది. పూరన్‌సింగ్‌తో వివాహేతర సంబంధం కొనసాగించింది. ఈ క్రమంలోనే ఇంటి సమీపంలోనే ఉంటున్న హర్యానాకు చెందిన నజీం(31)తో కూడా వివాహేతర సంబంధాన్ని నెరపసాగింది. తుక్కుగూడలో వేరుగా గది తీసుకుని అతడితో సహజీవనం సాగించింది. పూరన్‌కు అనుమానం వచ్చిందని గ్రహించిన వారు ఎలాగైనా అతడిని మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నారు.

పథకంలో భాగంగా..

ముందస్తు పథకంలో భాగంగా జయాదేవి, నజీం కామన్ ఫ్రెండ్‌గా ఉన్న రాజేంద్రనగర్‌లో నివసించే తమిళనాడుకు చెందిన సుగుణా రాము(42)తో ఈ నెల 22న రాత్రి పూరన్‌సింగ్‌కు ఫోన్ చేయించి బాకీగా ఉన్న రూ.10 వేలు ఇస్తానంటూ తుక్కుగూడకు పిలిపించారు. నమ్మి వెళ్లిన పూరన్‌సింగ్‌ను నజీం, అతని స్నేహితుడు మబీన్, జయాదేవి, అసద్‌తో కలిసి దారుణంగా కత్తితో దాడి చేసి హత్య చేశారు. మృతదేహాన్ని డ్రమ్ములో కుక్కి జేసీబీ ముందుండే పారలో వేసుకొని సమీపంలోని సూరం చెరువులో పడేసి పరారయ్యారు. సాంకేతిక ఆధారాలతో పోలీసులు నజీం, సుగుణా రామును అరెస్ట్ చేయగా..మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నారు.

ఉత్సాహంగా బడిబాట

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపే లక్ష్యంగా చేపట్టిన జయశంకర్ బడిబాట కార్యక్రమం గ్రామాల్లో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ చిన్నారులతో సరదగా గడుపుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

- భాగస్వాములవుతున్న ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, యువజన సంఘాలు



తిమ్మారెడ్డిపల్లిలో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధనతో పాటు మౌలిక వసతులుంటాయని గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్ తదితర వసతులు కల్పిస్తామని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మండలంలో 45 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలున్నాయి.

17 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

మండల వ్యాప్తంగా ఈనెల 3న ప్రారంభమైన బడిబాట 17వరకు నిర్వహించనున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లతో పాటుగా విద్యార్థులు ఆటోల్లో, ప్రైవేటు వాహనాల్లో వెళ్లి ఇబ్బంది పడుతున్నారని ప్రచారం చేస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, యువజన సంఘాలు ప్రచారం బడిబాటలో భాగస్వామ్యులవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్కార్ బడులను బలోపేతం చేసేందుకు మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా మౌలిక వసతులు కల్పిస్తుంది.

మెరుగైన బోధన



తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన కొనసాగిస్తున్నాం. ఉచిత పుస్తకాలు. డ్రెస్‌లతో పాటు మరెన్నో సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

ప్రతిభను వెలికితీసేందుకే వేసవి శిబిరాలు

ఇండియన్ ఫారెస్టు సర్వీసెస్ ఆఫీసర్ రోమెల్



మాట్లాడుతున్న రోమెల్

ధారూరు: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడం అభినందనీయమని ఇండియన్ ఫారెస్టు సరీ్వసెస్ ఆఫీసర్ రోమెల్ అన్నారు. మండల పరిధిలోని కేరెళ్లి శ్రీసత్యసాయి సార్వజనిక కేంద్రంలో బాల వికాస్ విద్యార్థులకు 20 రోజులుగా వేసవి శిబిరం ఏర్పాటు చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరం ముగింపు సమావేశానికి రోమెల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల వికాస్ విద్యార్థులు చిన్ననాటి నుంచే సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలని సూచించారు. డ్రాయింగ్, క్రాఫ్ట్, పెయింటింగ్‌లలో విద్యార్థుల ప్రతిభను చూసి వచ్చిన అతిథులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల బాల వికాస్ రాష్ట్ర సమన్వయ కర్త హరినాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌సింగ్ ఠాగూర్, కేరెళ్లి సార్వజనిక కేంద్రం అధ్యక్షుడు రఘునందన్, ప్రధాన కార్యదర్శి ప్రేంకుమార్, సంస్థ బాధ్యులు వెంకట్‌రెడ్డి, నర్సింహులు గుప్తా, అనంత్‌రెడ్డి, నాగరాజ్, రామకృష్ణారెడ్డి, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

10న మెగా లోక్ అదాలత్

ఎస్‌ఐ రవి



కొడంగల్ రూరల్: ఈ నెల 10న నిర్వహిస్తున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ రవిగౌడ్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఫిర్యాదు దారుడు, నేరస్తుడు ఆధార్ కార్డులను తీసుకుని ఈ నెల 7 నుంచి 10 వరకు పీఎస్‌కు వస్తే అవగాహన కల్పిస్తామన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న పాల్వన్‌కుమార్

డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్

బంట్వారం: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన బంట్వారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి రికార్డులు, ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా పనిచేస్తూ సమయ పాలన పాటించాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. సిబ్బంది పనితీరుపై ఆయన ఆరా తీశారు. పల్లె దవాఖానలు, కంటి వెలుగు, న్యూట్రిషన్, కేసీఆర్ కిట్లు పంపిణీ, మాతా శిశు సంరక్షణ సేవలు, పెరిగిన మౌలిక వసతులు తదితర అంశాలపై ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఐఓ జీవరాజ్, డీఎంఓ సాయిబాబా, కోవిడ్ ఇన్‌చార్జి డాక్టర్ అరవింద్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మానస, సూపర్‌వైజర్ త్రివర్ణ, ఫార్మాసిస్టు అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించకుంటే..

- పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- పెద్దేముల్ గ్రామస్తులు

పెద్దేముల్: మురుగు సమస్యను పరిష్కరించకుంటే పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని గ్రామస్తులు అధికారులను హెచ్చరిస్తున్నారు. గ్రామంలోని 3వ వార్డులో కోట్ల నుంచి ప్రధాన రహదారికి వెళ్లే మార్గంలో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి మురుగు కూపంగా మారుతోంది. దీంతో ప్రజలకు నడిచేందుకు సైతం వీలు లేక ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మురుగుర కారణంగా ఈగలు, దోమలు వ్యాప్తి చెందడంతో రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు పంచాయతీ అధికారి, ఎంపీడీఓ, ఎంపీఓలకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపించారు. ఈ వెంటనే ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.



3వ వార్డులో నిలిచిన మురుగుతో ఇబ్బంది పడుతున్న స్థానికులు

పీఏసీఎస్ సెంటర్లో వసతులు కరువు



బొంపల్లి పీఏసీఎస్ నిర్వాహకుడికి వినతిపత్రం అందజేస్తున్న అనంతయ్య, రైతులు

మాజీ సర్పంచ్ అనంతయ్య

దోమ: మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ సెంటర్‌లో బాస్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అనంతయ్య గ్రామ రైతులతో సెంటర్ నిర్వాహకుడికి బుధవారం వినతిపత్రం అందించారు. సెంటర్‌లో కనీస వసతులు కరువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ ఏడాది సెంటర్లలలో గన్నీ బ్యాగుల కొరత లేకుండా, సుతిళ్లు, దబుడాలు, టార్పాలిన్లు, లారీల కొరత లేకుండా చేసేవారు. కానీ ఈ ఏడాది రైతులకు ఎలాంటి వసతులు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. సెంటర్‌కు వచ్చే వసతులు ఏటు వెళ్తున్నాయని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు వెంటనే ప్రతి సెంటర్లో రైతులకు అన్ని రకాల వసతులను కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లారీల కొరత లేకుండా సెంటర్లలోకి తెచ్చే ధాన్యాలను వెంట, వెంటనే మిల్లులకు తరలించాలని, రైతులకు అవసరమయ్యే హమాలీ మాత్రమే వసూలు చేయాలి. ఈ కార్యక్రమంలో బాస్‌పల్లి వార్డు సభ్యులు వెంకటయ్య, రైతులు మాల కృష్ణయ్య, అంజిలయ్య, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

'రైతుబంధు'కు దరఖాస్తుల స్వీకరణ



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓ శ్రీను

తాండూరు రూరల్: రైతులు పెట్టుబడిసాయం లబ్ధి పొందేందుకు రైతు బంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ శ్రీను అన్నారు. మంగళవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఏఈఓ మా ట్లాడుతూ.. కొత్త పాసు పుస్తకం ఉన్న రైతులు వ్యవసాయ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, రైతు బంధు అప్లికేషన్ ఫారం తీసుకొని కార్యాలయంలో సంబంధిత ఏఈఓలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నిషిత, రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే వికాసం: శ్రీనివాస్

కొడంగల్ రూరల్: ప్రతీ ఒక్కరూ అక్షరం, ఆరోగ్యం , ఆర్థికంగా ఎదగాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ చాటిన అప్పాయిపల్లికి చెందిన 12మంది విద్యార్థులకు, ఆశమ్మతండాకు చెందిన ఐదుగురు విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉద్యమకారులు బాలరాజ్‌గౌడ్, పాఠశాల హెచ్‌ఎం విష్ణుకుమార్, ఉపాధ్యాయులు వీరేశం, పృథ్వీసింగ్, నాగప్ప, వెంకటయ్య, సర్పంచు గీతా ఠాకూర్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, ఎంపీటీసీ సభ్యుడు రాములునాయక్, ఎస్‌ఎంసీ చైర్మన్ హన్మంతు, వార్డు మెంబర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి



పెద్దేముల్: రెగోండి గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎంఈఓ వెంకటయ్య



దోమ: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చందర్

జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న 'బడిబాట'

పెద్దేముల్: ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. మంగళవారం బడి బాట కార్యక్రమంలో భాగంగా కొండాపూర్, రేగొండి, మంబాపూర్, కందనెల్లి తదితర గ్రామాల్లో పర్యటించి ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆయన ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మంబాపూర్‌లో మన ఊరు–మన బడి కార్యక్రమం పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ శ్రావన్‌కుమార్‌ను కోరాడు. విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలకు వచ్చేలా కృషి చేయాలని ఎస్‌ఎంసీ చైర్మన్లను సూచించారు. మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింలు సిబ్బందితో గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయం నుంచి వచ్చిన ఏఎంఓ రాములు, హెచ్‌ఎంలు శ్రీనివాస్, మునీందర్‌రెడ్డి, పలు పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలని బడిలో చేర్పించాలి

దోమ: బడీడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ హరిశ్చందర్ సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో పిల్లల సంఖ్య గతేడాది కంటే పెరగాలన్నారు. ప్రభుత్వం అందించే నాణ్యమైన విద్యను పేద విద్యార్థులకు అందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. తరగతి గదులను శుభ్రం చేయించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని అంబేడ్కర్‌నగర్ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పేద విద్యార్థులు ప్రభుత్వం పాఠశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పురందాస్, మహేంద్రబహదూర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు సహకరించాలి

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులను చేర్పించాలని మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం నాగప్ప అన్నారు. మంగళవారం మండల పరిధిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఇంగ్లిష్ మీడియంతో పాటు విశాలమైన తరగతి గదులు ఉన్నాయని చెప్పారు. గ్రామంలోని పిల్లలు మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అబ్దుల్ మజీద్, గని కార్మిక సంఘం మాజీ వైస్ చైర్మన్ పండరి, కో ఆప్షన్ సభ్యులు షంషొద్దీన్, ఉపాధ్యాయులు జ్యోతి, యూసుఫ్ ,జయశ్రీ, భాగ్యశ్రీ ,స్వప్నకుమారి, ఉమేష్‌కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకే పంపించండి

కొడంగల్ రూరల్: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని హెచ్‌ఎం క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: మల్కాపూర్‌లో ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం



కొడంగల్ రూరల్: పాతకొడంగల్‌లో ఉపాధ్యాయుల ర్యాలీ

కిశోర బాలికలకు అన్నప్రాసన



అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ వెంకటేశ్వరమ్మ

ధారూరు: మండల పరిధిలోని రుద్రారం, నాగసమందర్ గ్రామాల్లో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కిశోర బాలికలకు బడిబాట, అన్న ప్రాసన, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ కిశోర బాలికలకు అన్న ప్రాసన చేశారు. అనంతరం ఆమె రెండు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పాఠశాలకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

పరిగి: మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు మంగళవారం పుస్తకాలను అందజేశారు. పట్టణ కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మార్సీ సిబ్బంది పుస్తకాలు అందించారు. కొత్త విద్యార్థులను పాఠశాలలో చేర్పించిన వెంటనే పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు పుస్తకాలను అందించి బోధన ప్రారంభిస్తామని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు.

బలమైన శక్తిగా భారత్

- పేద ప్రజలే లక్ష్యంగా సంక్షేమ పథకాల అమలు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలన దక్షత, దౌత్యనీతి, సాహసోపేత నిర్ణయాలతో భారతదేశం బలమైన శక్తిగా ఎదిగిందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లులో నూతనంగా నిర్మించిన బీజేపీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ దేశానికే కాకుండా, ప్రపంచానికే నాయకుడిగా ఎదిగారన్నారు. తమ ప్రభుత్వం అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఆర్టికల్ 356 రద్దు, ట్రిపుల్ తలాక్ చట్టం రద్దు తదితర నిర్ణయాలతో మోదీ ప్రజల అభిమానం చూరగొంటున్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడులతో జాతీయ రహదారులను నిర్మిస్తున్నట్టు చెప్పారు. దేశ భద్రత విషయంలో ప్రధాని కఠినంగా వ్యవహరిస్తున్నారని, దాయాది దేశమైన పాకిస్తాన్‌ను ఏకాకి చేసిన ఘనత మోదీకే దక్కిందన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా చూడటానికి తన విజన్‌తో పనిచేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో రూ.1.20 వేల కోట్లతో జాతీయ రహదారులను నిర్మించి 31 జిల్లాలకు అనుసంధానం చేసినట్లు కేంద్రమంత్రి వివరించారు. నియంత పాలన సాగిస్తున్న కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడడం ఖాయమన్నారు.

రాష్ట్రంలో బీజేపీ ఒంటరిగానే పోటీ

రాష్ట్రంలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య రహస్య అవగాహన ఉందని ఆరోపించారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసిన నేపథ్యంలో రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ మధ్య పొత్తు ఉంటుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎన్నో ఆశలతో ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని విమర్శించారు. రాష్ట్రంలో ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, సుధాకర్ రావు, మహేశ్వరం ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు కొప్పు భాషా, శేఖర్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్‌గౌడ్, అందె బాబయ్య, దిలీప్ ఆచారి, హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, శ్రీకాంత్‌సింగ్, రాంరెడ్డి, వెంకటేశ్, నర్సింహ, శ్రీధర్, సాయి తదితరులు ఉన్నారు.

పేదల భూములు పెద్దలకు కట్టబెడుతున్నారు

సీఎం కేసీఆర్ పేదల భూములను లాక్కొని పెద్దలకు కట్టబెడుతున్నారని, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా వ్యవహరిస్తున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. కొంగరకలాన్ సమీపంలో గత ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన భూములను బీఆర్‌ఎస్ సర్కార్ లాక్కుంటోందని అన్నారు. కోట్లాది రూపాయల భూములను లాక్కొని రైతులకు ఎకరాకు 300 గజాల ఇంటి స్థలం ఇస్తున్నారని, ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. హైటెక్స్ సమీపంలో ఓ కార్పొరేట్ సంస్థకు 15 ఎకరాల భూమిని కేటాయిస్తే, హైకోర్టు మొట్టికాయలు వేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే బీఆర్‌ఎస్ కార్యాలయం ఉండగా, శిక్షణ కేంద్రం పేరుతో కోట్ల రూపాయల విలువైన భూమిని నామమాత్రం రేటుకు బీఆర్‌ఎస్‌కు అప్పగించడం తగదన్నారు. తెలంగాణలో బీజేపీకి అధికారం ఖాయమని ఈటల ధీమా వ్యక్తం చేశారు.